



# కరపత్రం

SINCE 2014

సోమవారం జూన్ 23 2025 సంపుటి :0 సంచిక :248 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## పభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయం - మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్:
అందరి సహకారంతో అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని మంత్రులు వ్యాఖ్యానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయంపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయమని, ఈ విషయంలో పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి శ్రీధర్‌బాబు తేల్చి చెప్పారు. వ్యవసాయానికి పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాలో ఒక్క గుంట కూడా బీడు భూమి లేకుండా సాగుచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు వివరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

- 33,600 కోట్ల విలువైన కొత్త సంక్షేమ పథకాలు అమలులో.
- బడ్జెట్ నిధులు సమంగా పంచాలని సూచన.
- పెండింగ్ ప్రాజెక్టులు ప్రాధాన్యతకు అనుగుణంగా పూర్తి చేయాలన్న ఆదేశం.
- 10 రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి ప్రణాళిక తయారు చేయాలని సూచన.



## నాన్ ట్యాక్స్ రెవెన్యూపై అధికారులు దృష్టిపెట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్:
నాన్ ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ సబ్ కమిటీ ఛైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో జరిగిన అసెట్స్ సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మంత్రులు, కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. “అధికారంలోకి వచ్చిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఓఆర్ఆర్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నాం. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా.. మరికొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్‌లో అన్ని శాఖలకు సమానంగా పంచాలి. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి.. అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలి. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన ప్రాజెక్టుల ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్ర అవసరాలు, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులు ఖర్చు చేయాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, విభాగాలపై దృష్టి సారించాలి. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పనిచేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళ్తుంది. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి”అని అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు: మంత్రి పొంగులేటి

నకిరేకల్:
భారాస హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఇవ్వలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మొదటి విడతలో తమ ప్రభుత్వం 4.50లక్షల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.“ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు ఇస్తున్నాం. కులమతాలకు అతీతంగా కేటాయిస్తున్నాం. ఎన్నికల నాటికి పేదలకు 20లక్షల ఇళ్లు కట్టిస్తాం. లబ్ధిదారులకు 4 విడతల్లో రూ.5లక్షలు ఇస్తున్నాం. మధ్యవర్తులకు కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే వేస్తాం. న్యాయమైన భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది” అని పొంగులేటి చెప్పారు.



2 లో

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు - ఈటల రాజేందర్

సికింద్రాబాద్:
ఎందరో పౌరుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.

## ఆ 6 డిమాండ్లు నెరవేర్చాలి.. - మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్:
తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. రాష్ట్రంలో గ్రామాల స్థితి, పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారిందని లేఖలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు వల్ల తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.
కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు రాకపోవడంతో పంచాయతీ



కార్యదర్శులు తమ సొంత నిధులు ఖర్చు చేస్తున్నారని, ఆ బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. మాజీ సర్పంచులకు సైతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

2 లో



2లో..

## ‘పరిపాలన చేతకాక, హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారు’

హైదరాబాద్:
ధనిక రాష్ట్రంగా మొదలైన తెలంగాణ.. లక్షల కోట్లు అప్పుల పాలైందని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుంటే.. ఒక కుటుంబం బారినపడి బలి అయ్యిందని మండిపడ్డారు. అవినీతి పాలనతో, దోపిడితో,, కుంభకోణాలతో, అహంకారంతో, కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని దెబ్బ తీశారని ద్వజమెత్తారు.

## ఫోన్లు ట్యాప్ అయినవారి పేర్లు వెల్లడించాలి - మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్:
స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా నిర్ణయం జరగలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంత్రివర్గంలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బనకచర్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని చెప్పారు.“కాంగ్రెస్ ముఖ్యనేతలు, పారిశ్రామికవేత్తల ఫోన్లు ట్యాప్ చేసిన చరిత్ర భారాసది. ఫోన్లు ట్యాప్ అయినవారి పేర్లు వెల్లడించాలని సిట్‌ను కోరుతున్నా. కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు భావిస్తున్నాం. దీనిలో భాగమైన ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్తారు”అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.





## ఎర్రజెండా చూస్తే బీజేపీ నేతలు భయపడుతున్నారు.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఎర్రజెండా చూస్తే భయపడుతున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే.. సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంచిర్యాల జిల్లాలో జరిగిన సీపీఐ 4వ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులను ఎందుకు చంపుతున్నారని కూనంనేని ప్రశ్నించారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టన ఆపరేషన్ కగార్? ఆపకపోతే హిట్లర్ కు పట్టిన గతే పడుతుందని ఆయన హెచ్చరించారు. మావోయిస్టుల ఏరివేతను బేషరతుగా నిలిపివేయాలనీ డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు భావజాలం ఉన్న మావోయిస్టులు అరణ్యం వీడి మాతో కలిసి రావాలనీ పిలుపునిచ్చారు. వామపక్ష వాదులందరూ ఒక్కతాటిపైకి వస్తే బీజేపీ కి ప్రత్యామ్నాయంగా ఎదుగుతామన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పెద్దలు మతం, కులం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ విమర్శించారు.

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.7,700 కోట్లు




హైదరాబాద్:
రైతు భరోసా నిధులను తెలంగాణ ప్రభుత్వం వరుసగా ఆరో రోజూ జమ చేసింది. ఇప్పటి వరకు రూ. 7,700 కోట్లను రైతుల ఖాతాల్లోకి వేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రైతులకు నిధుల పంపిణీలో ఇదే రికార్డుగా పేర్కొంది. రాష్ట్రంలో రైతులకు వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందించటంలో ప్రభుత్వం సరికొత్త రికార్డు నమోదు చేసింది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జూన్?16న రైతు నేస్తం వేదికగా సీఎం నేరుగా రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. తొలి ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతులకు రూ. 7770.83 కోట్లను జమ చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

2 లో

# సంపాదకీయం

## రూ.లక్ష దిశగా తులం బంగారం.. ఒక్కరోజే రూ.2430 పెరిగిన పుత్తడి..!



అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియం తదితర ఉత్పత్తులపై సుంకాలు పెంచుతామని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన.. దాంతో ఫారెక్స్ మార్కెట్‌లో యూఎస్ డాలర్‌పై రూపాయి విలువ బలహీనం కావడం.. దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర 'బుల్' మీద పరుగులు తీస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం ఒక్కరోజే 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.2,430 వృద్ధితో తాజా జీవిత కాల గరిష్టాన్ని తాకి రూ.88,500 వద్ద ముగిసిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేసన్ పేర్కొంది. కాగా దేశీయ బులియన్ మార్కెట్‌లో ఇటీవలి కాలంలో బంగారం ధర ఇంత భారీగా పెరగడం ఇదే మొదటి సారి.అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్‌లో ఔన్స్ బంగారం ధర 2900 డాలర్లతో తాజా గరిష్ట రికార్డు పలికింది. స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల దిగుమతులపై 25 శాతం సుంకాలు పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ప్రకటించడంతో రిటైలర్లు, జ్యువెల్లర్ల నుంచి బంగారానికి కొనుగోళ్ల మద్దతు లభించింది. గత శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో 99.9శాతం స్వచ్ఛత గల బంగారం ధర రూ.86,070 వద్ద ముగిసింది.ఇక సోమవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ. 2,430 పెరిగి రూ. 88,100లతో తాజా రికార్డు నమోదు చేసింది. ఇక కిలో వెండి ధర సోమవారం రూ. 1,000 పెరిగి రూ.97,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిస్థితుల్లో అనిశ్చితితో ఇన్వెస్టర్లు రిస్క్‌తో కూడుకున్న స్టాక్స్‌కు బదులు బంగారం వంటి సురక్షిత పెట్టుబడి ఆప్షన్ల వైపు మళ్లుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్ డెలివరీ తులం బంగారం ధర రూ.940 వృద్ధితో రూ. 85,828 లకు చేరుకుని జీవిత కాల గరిష్టాన్ని తాకింది. మెటల్ ఉత్పత్తులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో బంగారం లాభాలు గడించింది. ఎంసీఎక్స్‌లో తులం బంగారం రూ. 85,800 ఎగువన ట్రేడ్ అవుతుండగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 2,900 డాలర్ల మార్క్‌ను దాటేసింది. అయితే, ఏయే దేశాల నుంచి దిగుమతి చేసుకునే మెటల్స్ మీద సుంకాలు పెంచుతామన్న విషయమై ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ క్లారిటీ ఇవ్వలేదు. కిలో వెండి జూన్ డెలివరీ ధర రూ.1,015 (1.18 శాతం) పెరిగి తాజా గరిష్ట స్థాయికి చేరుకోవడంతో రూ. 86,636 వద్ద ముగిసింది. ఇక సిల్వర్ ఫ్యూచర్స్ మార్చి డెలివరీ ధర రూ.632 పెరిగి రూ.95,965 వద్ద స్థిర పడింది.అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 45.09 డాలర్లు (1.56 శాతం) పెరిగి 2,932.69 డాలర్లతో తాజా గరిష్టాన్ని తాకింది. ఆసియా మార్కెట్‌లలో కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర దాదాపు ఒకశాతం పుంజుకుని 32.76 డాలర్లు పలికింది.

## షిర్డీ సాయిబాబా భక్తులకు గుడ్‌న్యూస్.. ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!





షిర్డీ సాయిబాబా భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్ - నాగర్ సోల్ మధ్య ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లు జులై 3 నుంచి 25 వరకు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. సికింద్రాబాద్ - నాగర్ సోల్ రైలు (07007) రైలు జులై 3 నుంచి ప్రతి గురువారం అందుబాటులో ఉంటుంది. ఈ రైలు రాత్రి 9.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. నాగర్ సోల్ -సికింద్రాబాద్ (07002) రైలు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ రైలు రెండుమార్గాల్లో మల్కాజ్‌గిరి, బొల్లారం, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ముదే?డ్, నాందెడ్, పూర్ణ, పర్బని, జాల్నా, ఔరంగాబాద్ స్టేషన్లలో ఆగుతుందని వివరించింది. ఈ రైలులో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్ ఏసీ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించింది.

## శ్రీశైలం ప్రాజెక్టు భారీగా వరద..

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నది వరద కొనసాగుతున్నది. భారీగా వస్తున్న వరదతో ఇప్పటికే జూరాల ప్రాజెక్టు నిండిపోయింది. డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని వరదను అధికారులు దిగువకు వదులుతున్నారు. అక్కడి నుంచి వరద శ్రీశైలం జలాశయానికి చేరుతున్నది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల వరద వస్తుందని అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 854.20 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 89.7132 టీఎంసీల నిలువ ఉన్నదని వివరించారు. అయితే, శ్రీశైలం డ్యామ్ కుడి, ఎడమ వైపు ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. నీటి మట్టం పెరిగితేనే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఒకదాని వెంట మరొకటి నెమ్మదిగా వస్తున్న కార్లు.. ఆపి తనిఖీ చేయగా బయటపడ్డ భాగోతం!



మాదక ద్రవ్య నియంత్రణ శాఖ, ఎక్సైజ్ శాఖ పోలీసుల నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో ప్రమాదకర డ్రగ్స్ తరలిస్తోన్న ఐదుగురు నిందితులు అరెస్ట్ అయ్యారు. నిర్మల్ జిల్లా వద్ద నేషనల్ హైవేపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లలో ప్రమాదకర డ్రగ్స్ లభించాయి. దీంతో డ్రగ్స్ తరలిస్తున్న ఐదుగురి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 425 కిలోల క్లోరల్ హైడ్రేట్, 1.115 కిలోల అల్ప్రాజోలం, రెండు ఎర్టిగా కార్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ మొత్తం డ్రగ్స్ విలువ రూ. 52 లక్షలుగా ఉండొచ్చని పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో డ్రైవర్ బసపల్లి రామ గౌడ్ (45) నిజామాబాద్‌కు చెందినవాడు కాగా.. మిగిలిన నలుగురు బుర్ర రమేష్ (36), కొట్టగిరి రాజం (59), ఎల్లందుల శ్రీనివాస్ (44), బుర్ర రాజశేఖర్ (34) కరీంనగర్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరంతా తాటికల్లు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తారని పోలీసులు తెలిపారు.కాగా వీరంగా మహారాష్ట్రలోని థానే జిల్లా నింబవాలి గ్రామంలో రహస్యంగా మాదక ద్రవ్యాలను తయారు చేసి.. తెలంగాణలో తాటికల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం వంటి ప్రమాదకర డ్రగ్స్‌ను ఉపయోగించి నకిలీ తాటికల్లు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించడమే వీళ్ల వ్యాపారం అని పోలీసులు తెలిపారు. అయితే నిజామాబాద్‌కు చెందిన రామ గౌడ్ అనే వ్యక్తి 2024 జనవరిలోనూ ఇదే తరహా డ్రగ్స్ సరఫరా చేస్తూ అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లాడని%ా% జైలు నుండి విడుదలైన తర్వాత అతను కొత్తగా గ్యాంగ్ ఏర్పాటు చేసి.. మరోసారి తన దందాను కొనసాగిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.ఈ గ్యాంగ్ సరఫరా చేసే క్లోరల్ హైడ్రేట్‌ను నిద్రలేమి, ఆందోళన తగ్గించడానికి ఉపయోగిస్తారు. అల్ప్రాజోలం అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యం. దీన్ని ఎక్కువగా వాడితే కిడ్నీ, కాలేయ సమస్యలతో పాటు మరణం కూడా సంభవించవచ్చని అధికారులు చెబుతున్నారు. మాదక ద్రవ్యాలు అనేక కుటుంబాలను దెబ్బతీస్తున్నాయని.. యువత, విద్యార్థులు ఇలాంటి చెడు అలవాట్లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా ఉంచాలని TSNAB అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా డ్రగ్స్ సంబంధిత అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే 8712671111 నంబర్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## ఆ 6 డిమాండ్లు నెరవేర్చాలి.. - మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల నోటిఫికేషన్ వస్తే.. బిల్లులు రావడం మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఆరు డిమాండ్లను హరీశ్‌రావు తన లేఖలో ప్రస్తావించారు.గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, గతంలో చేసిన పనులకు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, పారిశుద్ధ్యం పెంపొందించాలని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారికి వేతనాలు చెల్లించాలన్నారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని, వెంటనే వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'పరిపాలన చేతకాక, హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారు'

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీని ఏ రకంగా పని చేసిందో మనం చూశామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.ఇక గడిచిన ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే ఆ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసిందన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగ యువకులు, దళితులకు డిక్లరేషన్ల పేరుతో అనేక హామీలు ఇచ్చి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. అప్పులు ఇచ్చే వారు లేరని, తనను నమ్మే వాడు లేడని సీఎం రేవంత్‌రెడ్డి చేతులెత్తేశాడన్నారు. పరిపాలన చేతకాక, హామాలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేతులెత్తేసిందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు - ఈటల రాజేందర్

మొదటి పేజీ తరువాయి

సికింద్రాబాద్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఈటల మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనను కొనియాడారు. "నేను ఆరోగ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో దీనపరిస్థితి నెలకొని ఉంది. కరోనా వల్ల ప్రపంచమంతా విలవిల్లాడిపోయింది. అమెరికా, చైనాల్లో వచ్చిన పరిస్థితులు భారత్‌లోనూ వస్తాయని భయపెట్టారు. ఎంత మంది భయపెట్టినా ప్రధాని మోదీ భయపడలేదు. దేశంలోనే కొవిడ్ వ్యాక్సిన్ల తయారీని ప్రధాని ప్రోత్సహించారు. దేశ ప్రజలకే కాదు.. విదేశాలకు కూడా వ్యాక్సిన్లు ఇచ్చి భారత్ ఆదుకుంది. మన దేశంలో మేధోశక్తి విదేశాలకు వలస పోవద్దని భావించి ప్రధాని మోదీ మేకిన్ ఇండియా అమలు చేశారు. ఎన్నో కోట్ల నిధులు ఇచ్చి స్టార్టప్ కంపెనీలను కేంద్రం ప్రోత్సహించింది" అని ఈటల చెప్పారు.

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.7,700 కోట్లు

మొదటి పేజీ తరువాయి

"శనివారం నాటికే రాష్ట్రంలో 9 ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. గడిచిన ఏడేళ్లలో ఇంత వేగంగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం ఇదే మొదటిసారి. గతంలో రైతులకు పంటల పెట్టుబడి సాయం ప్రభుత్వం గరిష్ఠంగా 169 రోజుల వరకు సాగదీసినట్లు పంపిణీ చేసింది. వ్యవసాయ శాఖ రికార్డుల ప్రకారం 2021లో 11 రోజుల వ్యవధిలో రూ.7360 కోట్లు జమ చేయటం ఇప్పటి వరకు ఉన్న రికార్డు. ఇప్పుడు మా ప్రభుత్వం అంతకంటే వేగంగా 6 రోజుల్లోనే రూ.7770 కోట్లు పంపిణీ చేసింది. తొమ్మిది రోజుల్లో మొత్తం రూ.9 వేల కోట్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆర్థిక, వ్యవసాయ శాఖలు కృషి చేస్తున్నాయి" అని తుమ్మల తెలిపారు.

## ఆ విమానాలు నిలిపివేయడమే మంచిది



ఎయిర్ ఇండియా బోయింగ్ 787-%8 రకం విమానాల్లో సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వాటి సర్వీసులను నిలిపివేయడమే మంచిదని విమాన ప్రయాణాలు సాగించేవారిలో 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 రకం విమానం ఈ నెల 12న అహ్మదాబాద్‌లో కూలిపోవటంతో 270 దుర్మరణం చెందారు. ఈ ఘటన తర్వాత విమాన ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి ఏయే అంశాలపై ఎలాంటి ఆలోచనలు కలిగి ఉన్నారన్నది తెలుసుకునేందుకు లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 40 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది.ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా తాము ప్రయాణించబోయేది ఏ రకం విమానం అన్నదానికి ప్రయాణికులు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిసింది. 41 శాతం మంది తాము ఏ రకమైన విమానంలో ప్రయాణించబోతున్నాము.. అది ఏ కంపెనీది అన్నది కూడా చూస్తున్నారు. సర్వేలోని కొన్ని ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు..

## విజయవంతంగా 'సే నో టూ డ్రగ్స్ ..అండ్ ఎస్ టూఫ్ లైఫ్' సైక్లోథాన్




నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ విభాగం నిర్వహించిన సైక్లోథాన్ విజయవంతమైంది. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ సైక్లోథాన్‌ను నిర్వహించింది.నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో ఆధ్వర్యంలో జూన్ 21న సే నో టూ డ్రగ్స్ అండ్ ఎస్ టూఫ్ లైఫ్ అనే నినాదంతో ఈ సైక్లోథాన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం నానక్ రామ్ గూడా స్టార్ ఆస్పత్రి నుంచి ఈ రైడ్ జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైక్లోథాన్‌తో పాటు పలువురు ముఖ్య అతిథులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో చెరువులో మునిగి ఇద్దరు మృతి



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి బాలిక, యువకుడు మృతి చెందారు. చెరువులో పడిన ప్రణీత(12)ను కాపాడేందుకు బాలిక తండ్రి, ఇంద్రసేనారెడ్డి అనే యువకుడు ప్రయత్నించారు. ఈ ఘటనలో ప్రణీత(12), ఇంద్రసేనారెడ్డి(20) నీట మునిగి మృతి చెందారు. బాలిక తండ్రిని స్థానికులు కాపాడారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.

# ఆదివాసీలను చంపుతున్న మావోయిస్టులు

**- ఆదరించిన ఆదివాసీలకు శిక్షలు**
**- ఆదివాసీలను సభ్య సమాజానికి దూరం చేస్తున్నది ఎవరు?**

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

కేంద్ర ప్రభుత్వ బలగాలు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని మావోయిస్టు ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ చేసిన ప్రచారం ఒక బూటకమని తేలిపోయింది.ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసా మార్గాన్ని చేపట్టి సాయుధ పోరు చేస్తున్న నక్సలైట్లు శాంతి చర్చలు అంటూ సభ్య సమాజాన్ని మభ్య పెట్టాలని చూశారు. ఆదివాసీలను చంపి, అటవీ సంపదను ఖనిజ సంపదను పెట్టుబడిదారుల పాలు చేయడానికే అని జరిగిన ప్రచారం తప్పు.ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మావోయిస్టులు అడవిలో ఒక ప్రత్యేక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దండకారణ్యం లోని అబూజ్ మడ్, నేషనల్ పార్క్ ప్రాంతం, కర్రె గుట్టల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని మావోయిస్టులు సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

**- మావోయిస్టుల ప్రభుత్వంలోని అమాయకులైన ఆదివాసీలను కాల్చి చంపుతున్నారు**

చత్తీస్ ఘడ్ సరిహద్దుల్లోని బీజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్ ఫార్మర్లు అనే కారణంతో ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు చంపేశారు.చనిపోయిన వ్యక్తులు ఇద్దరూ ఆదివాసీలు. అందులో ఒకరి పేరు దేవా.అతను మాజీ మావోయిస్టు . శనివారం అర్ధరాత్రి మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.యాంపురం, సంద్రం బోరు గ్రామాల్లో ఈ




సంఘటనలు చోటు చేసుకున్నాయి.మూడు రోజులక్రితం ఇన్ ఫార్మర్లు అనే నెపంతో ఇద్దరిని హత్య చేసిన మావోయిస్టులు తాజాగా మరో ఇద్దరిని హత్య చేయడం కలకలం రేపింది.కీకారణ్య గ్రామాల్లో ఇన్ ఫార్మర్లు అనే కారణం చూపి ఆదివాసీలను హత్యలు చేయడం కలవరపాటుకు గురి చేసింది.

**- ఆదివాసీలకు శత్రువులు ఎవరు ?**
**- మావోయిస్టులా? రక్షణ బలగాలా?**

గత నెలలో బీజూపూర్ జిల్లాలో ఇన్ ఫార్మర్లు అనే కారణంతో ఒకే రోజు నలుగురు ఆదివాసీలను మావోయిస్టులు చంపేశారు.

**- మావోయిస్టుల గుప్పిట్లో నలిగిపోతున్న ఆదివాసీలు**

ఆపరేషన్ కగార్ పేరిట భద్రతా బలగాలు చత్తీస్ ఘడ్, తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో మావోయిస్టులను ఏరి వేస్తున్నాయి.ఇటీవలికాలంలో మావోయిస్టులు పెద్ద ఎత్తున చనిపోయారు. ఎక్కువ సంఖ్యలో లొంగిపోయారు.మావోయిస్టుల చేతుల్లో చిక్కుకున్న ఆదివాసీలు బ్రతకడం కోసం జనజీవన స్రవంతిలో కల్సి పోతున్నారు.




**- ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలతో తమ కాళ్లపై తాము నిలబడే ప్రయత్నం చేస్తున్నారు**
**- ఆదివాసీలు తమ గుప్పిట నుండి జారకుండా ఉండడానికి మావోయిస్టులు వారి వందేమాగదులు ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తున్నారు**

భద్రతా బలగాలకు భయపడి మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కల్సిపోతున్నప్పటికీ మావోయిస్టుల నుంచి ముప్పు తొలగిపోవడం లేదు.లొంగిపోయిన మావోయిస్టులు పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్లే తమవాళ్లు ఎన్ కౌంటర్లలో చనిపోతున్నారని మావోయిస్టుల అనుమానం.ఈ అనుమానమే పెనుభూతమై లొంగిపోయిన ఆదివాసీలపై మావోయిస్టులపై ప్రతీకారచర్యలకు పాల్పడుతున్నారు.

**- కలకలం రేపిన మావోయిస్టుల లేఖ**

ఇదిలా ఉండగా చత్తీస్ ఘడ్ సుక్మా జిల్లాలో మావోయిస్టులు వార్నింగ్ లేఖ విడుదల చేశారు. కొంట ఏరియా కమిటీ పేరిట లేఖ విడుదలయ్యింది. అటవీ సంపదను దోచుకోవడానికి కేంద్రం మావోయిస్టులపై దుశ్చర్యలకు పాల్పడుతున్నదని, ప్రభుత్వ దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మావోయిస్టులు హెచ్చరించారు.

**సౌజన్యం: జంగిల్ టైమ్స్**

## తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశం



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నిజామాబాద్ జిల్లా,ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు.ఈ సమావేశానికి ఎన్.నాగేందర్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు హాజరయ్యారు.ఈ సమావేశంలో అసోసియేషన్ భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు.అసోసియేషన్ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నిజామాబాద్ జిల్లా తరపున రూ. 10వేల ఆర్థిక సహాయం అందించాలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ ఉపాధ్యక్షులు ముత్తారం నర్సింహ స్వామి పాల్గొని పెన్షనర్ల సమస్యలగురించి ప్రసంగించారు

## రాజబొల్లారం ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ నియోజకవర్గం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని, రాజ బొల్లారం గ్రామంలోని శ్రీ హనుమాన్ సమేత సీతారామచంద్రుల ఆలయ 4వ వార్షికోత్సవంలో మేడ్చల్ ఎమ్మెల్యే శ్రీ మల్లారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్ ఛార్జ్ మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు భాస్కర్ యాదవ్, రాజమల్లారెడ్డి తో పాటు ఇతరనాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

**- పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ...**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

నిజామాబాద్ జర్నలిస్టులకు నగరంలో నివాస యోగ్యం కలిగిన స్థలాలు నూటికి నూరు శాతం ఇస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ తో విపులంగా చర్చించామని వారు తెలిపారు.ఎట్టి పరిస్థితుల్లోనూ నెలలో ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని మహేశు క్మార్,షబ్బీర్ అలీ వెల్లడించారు.హైదరాబాద్ కు వచ్చి జర్నలిస్ట్ బృందం కలిసిన తర్వాత ఇండ్ల స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచనలు



ఇచ్చామన్నారు.ఆదివారం రోజున ఛలో హైదరాబాద్ టీమ్ ఆద్వర్యంలో యూనియన్లకు అతీతంగా జర్నలిస్టు నాయకులు నిజామాబాద్ లో మహేష్ గౌడ్,షబ్బీర్ అలీని గౌరవ పూర్వకంగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ఐ న్యూస్ పంచారెడ్డి శ్రీకాంత్,బిగ్ టీవీ కత్తుల రాజేష్,సుభాష్ వాగ్మరే,విజయ క్రాంతి ప్రమోద్ గౌడ్,పాకాల నర్సింలు,99టీవీ మండే మోహన్,వి6 రజనీకాంత్,మేఘ9 విఘ్నేష్,ఎన్ టీవీ బాలకుమార్,టీవీ9దివాకర్, పీటీఐ ఆనంద్ పాల్, బీఆర్కే ధనుంజయ్,ఇండియన్ ఎక్స్ప్రెస్ శాస్త్రి,జమాల్పూర్ గణేష్,క్రైం మధు,కబురు శివన్న (శివ కుమార్),దిశ ఆడెపు శ్రీనివాస్,ప్రెస్ క్లబ్ కోశాధికారి సందీప్,ఉపాధ్యక్షుడు ఆంజనేయులు,గోవింద్ రాజ్, మహమ్మద్ గౌస్,కొట్టూర్ శ్రీనివాస్,మల్లెపూల నర్సయ్య,సతీష్ గౌడ్,భాస్కర్ గౌడ్,అక్షర విజేత అహ్మద్,కర్క రమేష్,సంగీత,అనిత,రవిబాబు,కట్ట సతీష్,యాసిన్,ఉస్మాన్,రవుఫ్,ఫరూక్,సాజిద్,సదానంద్ ,ప్రజాగలంనూక రవి,అజ్మత్,జైపాల్,డాక్టర్ శ్రీనివాస్,శ్రీధర్,సురేందర్ గౌడ్ తో పాటు వీడియో,ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నో ప్లాస్టిక్ తో పూర్వ విద్యార్థుల గెట్ టూ గెదర్

**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ టౌన్,జూన్ 22 :**
నిజామాబాద్ కాకతీయ జూనియర్ కళాశాల 2002 2004 సిఇసి బ్యాచ్ విద్యార్థులు నో ప్లాస్టిక్ తో గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకుండా మోదుగ ఆకులుతో తయారుచేసిన ప్లేట్స్,జొన్న వ్యర్థాలతో తయారు చేసిన గ్లాసెస్,బ్యానర్ ప్లాస్టిక్ తో కాకుండా క్లాత్ బ్యానర్ ఇలా పర్యావరణానికి హాని కలిగించకుండా విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలు. భారీగా తగ్గనున్న ఎంపీటీసీల సంఖ్య




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు జరుగుతోంది.రాష్ట్రంలోని 566 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ తుది జాబితా ఖరారు చేసింది. ప్రస్తుతం తెలంగాణలో 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.అయితే ఇటీవల కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, కార్పొరేషన్ సమీపంలోని గ్రామాల విలీనం, మేడ్చల్ జిల్లా మొత్తాన్ని అర్బన్ ప్రాంతంగా మార్చడం, ORR లోపలి మండలాలన్నింటినీ మున్సిపాలిటీలుగా మార్చడంతో ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తగ్గనున్నట్లు తెలుస్తోంది.

# షబ్బీర్ అలీ, మహేశ కుమార్ లతో భేటీ అయిన కలెక్టర్

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

నిజామాబాద్ నగరంలో పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఆదివారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసన మండలి సభ్యులు బి. మహేశ్ కుమార్ గౌడ్ లతో జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి భేటీ అయ్యారు.రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద వారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.అనంతరం గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లతో కలెక్టర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.జిల్లా ప్రగతికి చేపట్టాల్సిన చర్యలు,కొత్త పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న అవకాశాలు తదితర విషయాలపై పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకున్నారు.జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికార యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం



తరపున పూర్తి సహకారం అందేలా చూస్తామని షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ గౌడ్ లు తెలిపారు.ఈ భేటీలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, సహకార యునియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి





రాజిరెడ్డి,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్,నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్ దెబ్బతీస్తున్నారు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**




తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.ఎందరో పౌరుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈటల పేర్కొన్నారు.
సికింద్రాబాద్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఈటల మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనను కొనియాడారు.మన దేశ మేధోశక్తి విదేశాలకు వలస పోవద్దని ప్రధాని మోదీ మేకిన్ ఇండియాతో ఎన్నో రూ.కోట్ల నిధులు ఇచ్చి స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించారన్నారు.ఈటెల రాజేందర్ ఎంపీ గా గెలిచి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్ లో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంక్షేమ సారధి తొలి సిఎం కేసీఆర్...

- కేసీఆర్ పాలనే తెలంగాణ కు శ్రీరామరక్ష...
- స్దానిక సంస్దల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలి
- బిఆర్ఎస్ సైనికులు ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ శ్రేణులను హామిలు నేరవేర్చాలని నిలదియాలి
- కేసీఆర్ పాలనే తెలంగాణ కు శ్రీ రామరక్ష
- రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బి.ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

సంక్షేమ సారధి తొలి సిఎం కేసీఆర్ వారి పాలనే తెలంగాణ కు శ్రీరామరక్షని...స్దానిక సంస్దల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలి... గెలుపే లక్ష్యంగా పనిచేయాలి... బిఆర్ఎస్ సైనికులు ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ శ్రేణులను హామిలు నేరవేర్చాలని నిలదియాలని రాబోవు స్దానిక సంస్దల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. పాలకుర్తి మండల పరిధి ఎల్కలపల్లి ఎంపిటిసి పరిధిలో తెలంగాణకు కెసిఆర్ పాలన శ్రీరామరక్ష కార్యక్రమంతో పాటు బిఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర ప్రజలను ఆగం పట్టిస్తూ.. అబద్దపు పాలన కొనసాగిస్తు న్నదని మండిపడ్డారు. స్థానిక సంస్థల సమరంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు గులాబీ సైనికులు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం పక్కన పెట్టి రాష్ట్రాన్ని మళ్లీ ఆగం పట్టిస్తుందని విమర్శించారు. ఇప్పటి దాకా ఆరు గ్యారంటీలను అమలు చేయలేక రోజుకో నాటకం ఆడుతున్నదని విమ ర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రైతుభరోసాతో ప్రజలను మాయ చేస్తున్నదన్నారు. వచ్చే స్థానిక సమరంలో ప్రజలు కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్పేం దుకు వేచి చూస్తున్నారని, రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.కెసిఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని చెప్పారు.తెలంగాణ రాష్ట్రం కోసం 14 ఎళ్లు పోరాటం సాగించి తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా స్వరాష్టాన్ని సాధించి కారణ జన్మలు కేసీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని మహా సంకల్పంతో కాలేశ్వరం ప్రాజెక్టు ఎంతో అద్భుతంగా నిర్మాణం చేశారన్నారు. కెసిఆర్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించి ప్రజల ముఖాల్లో ఆనందం నింపారని గుర్తుచేశారు. రైతులను రాజుల చేయాలని సంకల్పంతో రైతులకు ఉచితంగా రైతుబంధు సకాలంలో ఎరువులు పంపిణీ చేసి రైతుల కళ్లలో ఆనందం నింపారని, 18 నెలల కాంగ్రెస్ పాలనలో రైతులను అరిగొస పెడుతున్నరన్నారు. కెసిఆర్, కేటీఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ప్రజా సంక్షేమాన్ని మరిచారని అన్నారు. రైతులకు కెసిఆర్ పాలనలో సకాలంలో పెట్టుబడి సహాయం రైతు బంధు అందించే వారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ముందు రైతుబంధు వేస్తున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపించాలని కార్యకర్తలు నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి, ఇంజపురి నవీన్, రాగం శ్రీనివాస్, పల్లే శ్రీనివాస్, పసూల భాస్కర్ శ్రీనివాస్, నర్సింగ్, రాంకోటి రెడ్డి, బండారి ప్రసాద్, మేకల శ్రీనివాస్, బండారి భూమయ్య, నారాయణదాసు మారుతి, నీరటీ శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

## 1521 రోజులుగా పేదలకు అన్నార్తులకు అన్నదాన సేవలు




**కరపత్రం ప్రతినిధి వేములవాడ జూన్ 22**

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1521 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఆదివారం రోజున లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు, ప్రతాప సంపత్ స్వప్న దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివ దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలను కునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించా లని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, నాగుల చంద్రశేఖర్, పొలాస రాజేందర్, పసుల శ్రీనివాస్,సగ్గు రాహుల్ పాల్గొన్నారు

## నంబరు ప్లేట్‌లేని ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా

... అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 22..**





జమ్మికుంట మండలం పరిధిలోని విలాసాగర్, కొండపాక గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా మళ్లీ వేగం పుంజుకుంది.నంబరు ప్లేట్‌లను తొలిగించిన ట్రాక్టర్ల ద్వారా పట్టపగలే పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ దందా స్థానికుల కళ్లకు కన్పిస్తున్నా, సంబంధిత అధికారుల స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎవరెవరు ఈ అక్రమ వ్యాపారానికి మద్దతుగా ఉన్నారో బయటపెట్టాలని, వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని, నంబరు ప్లేట్‌లు లేని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆర్మీలో ఉద్యోగాల పేరుతో మోసం.. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ జూన్ 22..**

ఆర్మీలో ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేశారు. బిహార్‌కు చెందిన ఆశీష్ కుమార్ గతంలో బిహార్, కోల్‌కతాలోనూ మోసాలు చేసినట్టు గుర్తించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.బిహార్‌కు చెందిన ఆశీష్ కుమార్ హైదరాబాద్‌లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా చేస్తున్నాడు. సొంత రాష్ట్రంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌నంటూ బురిడీ కొట్టించి ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అతడి నిజస్వరూపం తెలిసి భార్య విడిపోయింది. జనవరిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా చేసేందుకు హైదరాబాద్ చేరాడు. ఇతడి మామ బిహార్‌లో ఎయిర్‌ఫోర్స్ విభాగంలో పనిచేసేవాడు.

## కౌశిక్ రెడ్డి ఒక రాజకీయ జోకర్..ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూన్ 22**

**- కేసీఆర్ కాళేశ్వరం,కేటీఆర్ కారు రేసింగ్,కవిత లిక్కర్ స్కాంల చుట్టూ తిరుగుతూ ఉంటే.ఇవి సరిపోక కౌశిక్ రెడ్డి అనే ముల్లకంపను మీ చుట్టూ తగిలించుకుంటున్నారు.**
**- బెదిరింపులు,వసూళ్ళు,ఇదే కౌశిక్ రెడ్డి రాజకీయం**
**- బెదిరింపు కేసుకు,కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు.**
**- బాధిత మహిళా ఫిర్యాదు చేస్తే అది ఫాల్తుకేసా?.**
**- దమ్మక్కపేటలో పైప్ లైన్ పనులకు శ్రీకారం.**
**- హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి మా లక్ష్యం..**



హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్దే తమ ప్రధాన లక్ష్యమని,ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా పరిష్కారం చూపిస్తున్నామని,భవిష్యత్ లో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణ పరిధిలోని దమ్మక్కపేటలో 20లక్షలతో చేపట్టిన పైప్ లైన్ పనులను ప్రారంభం చేశారు.అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబానికి తొత్తులుగా మారిన వ్యక్తులు ఎవరు తప్పు చేసిన ఆది ఒప్పు అన్నట్టుగా కేటీఆర్,హరీష్ రావు మాట్లాడడం సిగ్గుచేటని,అసలు కేసు ఎందుకు అయ్యిందో బీఆర్ఎస్ నాయకులు గమనించాలని అన్నారు.ఒక గ్రానైట్ వ్యాపారిని బెదిరించి 50 లక్షల రూపాయలు ఇస్తావా,చస్తావా అని బెదిరిస్తే వ్యాపారి భార్య సుబేదారి పోలీసు స్టేషన్ లో కేసు పెడితే పోలీసులు కేసు నమోదు చేశారనీ,ఏదో ఉద్యమం చేసి రిలీజ్ అయిన వ్యక్తిలాగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి బిల్డప్ ఇవ్వడం చూస్తే ప్రజలు నవ్వుకుంటున్నారని,ఎలాంటి తప్పు చేయకపోతే ముందస్తు బెయిల్ కు ఎందుకు వెళ్లాడనీ?ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి చిల్లర వీధిరౌడీలాగా,రాజకీయ జోకర్ లాగా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు.మహిళ ఫిర్యాదు చేస్తే ఆ కేసు మీకు ఫాల్తు కేసులాగా కనపడుతుందా అని కేటీఆర్,హరీష్ రావు ను ప్రశ్నించారు.ఇదే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు 25 లక్షలు ఇచ్చాను అని వ్యాపారి చెప్పింది నిజం కాదా అని,నియోజకవర్గంలో అనేక మందిని ఇబ్బందులకు గురి చేసింది కౌశిక్ రెడ్డి,స్వయంగా బాధితులే ప్రెస్ మీట్ పెట్టి చెప్పారనీ,ఇంకోసారి కౌశిక్ రెడ్డి స్థాయికి మించిన మాటలు మాట్లాడితే గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ,మండల అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 22**




కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు పేర్కొన్న హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక జమ్మికుంట పట్టణ ప్రెస్ క్లబ్ లో ఫోరం నేతలు ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కడి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉద్యమకారుల హామీల అమలు సాధనకు ప్రెస్ మీట్ నిర్వహించినట్టు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను మాత్రమే గుర్తు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఒక కమిటీని వేయాలని సూచించారు. తద్వారా భావితరాలకు ఉద్యమకారుల గురించి తెలిసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. సంక్షేమ కార్యక్రమాలలో ఉద్యమకారులకు 20 శాతం వాటా ఇవ్వాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అవకాశాలు ఇవ్వాలని అన్ని పార్టీలను అడిగారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ..సెప్టెంబర్ 17 లోపు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరు బాటలో నడిచిన ఉద్యమకారులను మరువద్దని విన్నవించారు. 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ ఉద్యమకారులకు ఇవ్వాలన్నారు. తాము కోరుతున్నవి ఆర్థికేతర అంశాలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఉద్యమకారుల పక్షాన వారి సంక్షేమం కోసం ఉద్యమకారుల ఫోరం కొట్లాడుతుందని వెల్లడించారు. ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జార?ండ్ తరహాలో పింఛన్లు ఇవ్వాలని చెప్పారు. ఉద్యమకారులను గుర్తించేందుకు తొలుత ఓ కమిటీని వేయాలన్నారు.వాసాల రామస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 1969 తర్వాత మలిదశ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర కీలకమైనదని వెల్లడించారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్లు .. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు మాత్రమే అని, వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నట్టుగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి, రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆకుల రాజేందర్, వాసాల రామస్వామి, మండల టౌన్ అధ్యక్షులు పొట్లాల మల్లేష్, నారపల్లిఅంజన్న, కారింగుల రాజేందర్, బిజిగిరి శ్రీకాంత్,రామిడి సూర్య, ఇటుకల గణేష్, పచ్చిమట్ల భాను,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ రహిత ప్రాంతమే ప్రధాన లక్ష్యం

- వన్ టౌన్ ఎస్ఐ రమేష్...

**కరపత్రం ప్రతినిధి రామగుండం:జూన్ 22:**







గంజాయి రహిత సమాజం లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎస్ఐ రమేష్ యువత కు, ప్రజలకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఉత్తర్వుల ప్రకారం మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో సందర్భంగా గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలలో భాగంగా ఆదివారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఇంద్ర నగర్ లో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ..... గంజాయి, మత్తు పదార్థాల వినియోగానికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అలవాటు పడకూడదన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రధానంగా గంజాయి వినియోగం, అమ్మడం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు గంజాయి, డ్రగ్స్ వల్ల వ్యక్తిగతంగా తమకు, సమాజానికి కలిగే నష్టాలను గుర్తించాలని, వాటిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేయాలని ఎస్ఐ సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వైద్యులు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం, అమ్మకం, సరఫరా రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ ఐ రమేష్ ఈ సందర్భంగా కోరారు.